# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

గురువారం | 16 | మార్చి | 2023 | పేజీలు : 6


# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

### పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



సిరిసిల్ల టౌన్, మార్చి 15 (మనం న్యూస్): జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతం వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బుధవారం సిరిసిల్ల పట్టణం లోని సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేసి, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిఘా నేత్రాల ఏర్పాటును పనితీరును పరిశీలించారు. పరీక్ష జరుగుతున్నతీరు, విద్యార్థుల హాజరు వివరాలు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ వనజ కుమారి కలెక్టర్‌కు వివరించారు. పరీక్షా కేంద్రంలో 198 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 183 మంది హాజరైనట్లు, 15 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్‌కు తెలిపారు.

# మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన మంత్రి గంగుల



కొత్తపల్లి, మార్చి 15 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తిలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా అభ్యున్నతికి సిఎం కెసిఆర్ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఇప్పటికే అడబిడ్డల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్న కెసిఆర్, గృహలక్ష్మి పేరుతో మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వచ్చే వారం నుండి కొత్తగా గృహలక్ష్మి పథకాన్ని చేపడుతున్నారని, ఇంటి స్థలమున్న వారికి ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షలు అందించనున్నారని తెలిపారు. ఇలాంటి పథకాలు కేవలం తెలంగాణలోనే అమలవుతున్నాయని అన్నారు. రేకుర్తి మహిళా భవనం కోసం ఇప్పటికే 15 లక్షలు ఇచ్చామని, మొదటి అంతస్తు నిర్మాణం కోసం మరో 10 లక్షల రూపాయల నిధులను విడుదల చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు సుదగోని మాధవి కృష్ణాగౌడ్, ఏదుళ్ల రాజశేఖర్, నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్‌ను శాంతియుతంగా వాతావరణంలో జరుపుకోవాలి

### ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలి

### మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (మనం న్యూస్): రంజాన్ ను శాంతియుతంగా వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ సందర్భంగా ఏర్పాట్లపై పోలీసులు, ముస్లీం మత పెద్దలు, విశ్వ హిందు పరిషత్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈనెల 23వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి గంగులకమలాకర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులు చేయాలని, తాగునీరు ఉండేలా చూడాలని, నల్లా నీరు సమయానుసారం సరఫరా చేయాలని, వీధిదీపాలు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారికి ఆదేశించారు. కరెంటు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు . నైట్ మార్కెట్లు, ఫ్రూట్, వెజిటేబుల్ మార్కెట్ లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హరీస్ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదే శించారు. రంజాన్ పండుగను పండుగ వాతావరణంలో జరుపు కోవాలని ముస్లిం మత పెద్దలను కోరారు.ఈ సమావేశం లోకలెక్టర్ ఆర్వి కర్ణన్, సీపీ సుబ్బ రాయుడు, అదనపు కలెక్టర్లు గరిమ అగర్వాల్, శ్యామ్ ప్రసాద్ లాల్, మున్సిపల్ కమిషనర్ సేవ ఇస్లావత్, పోలీస్, రెవెన్యూ మున్సిపల్ అధికారులు, ఎంఐఎం పార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



# మన ఊరు మనబడి’ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట,మార్చి15( మనంన్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మనబడి’ కింద మొదటి విడత చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.కోనరావుపేట మండలం ధర్మారం, సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు ఆశించిన వేగంగా జరగకపోవడం పై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతం లోగా మొదటి విడతలో మన ఊరు మనబడి కార్యక్రమం కింద బడుల్లో చేపట్టిన ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, ఇతర రిపేర్ల ను త్వరగా కంప్లీట్ చేయాలని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేసే పనుల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు ప్రహారీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెలాఖరులోగా మిషన్ భగీరథ కింద కనెక్షన్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీర్ల ను ఆదేశించారు. కనగర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇప్పటివరకు గ్రామంలో 724 మందికి పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిపిచంద్రయ్య , జిల్లా విద్యాధికారి రమేష్ , జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీరాములు ,ఎంపీడీవో రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న పబ్లిక్ సర్వీస్ కమీషన్

### కష్టపడి చదువుకున్నాఫలితం శూన్యం



వీణవంక-మార్చి 15 9మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీ స్ కమీషన్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు జున్నూతుల మధుకర్‌రెడ్డి అ న్నారు. బుధవారం మండలంలోని రెడ్డి పల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 16లక్షలమంది నిరుద్యోగులు ఉన్నారని గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్ల కొరకు ఎదురు చూసి తీరా నోటిఫికేషన్ విడుదలైన తరువాత వివిధ పోటీ పరీక్షలు రాశారని, టిఎస్‌పిఎస్‌సి అధికారులు ,సిబ్బంది పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ చేయడంతో పాటు వాటిని అమ్ముకోవడం దారుణమన్నారు. టిఎస్‌పిఎ స్‌సి నిర్వాకంతో నిరుద్యోగుల్లో ఎంతో నిరాశ నిస్పృహ ప్రారంభమైందని ,ఈ కుంభకోణంలో ఉన్నవారిని అరెస్ట్ చేసి సిబిఐ అధికారులతో దర్యాప్తు చేయించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు.

# కంటి వెలుగు శిబిరం ప్రారంభం




చొప్పదండి, మార్చి 15 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా చొప్పదండి 11వ వార్డులోని గౌడ సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ భూమారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధత్వరహిత రాష్ట్రంగా తెలంగాణను రూపొందించేందుక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తోన్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ పెరుమాండ్ల మానస గంగయ్యగౌడ్, మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ అంజయ్య, మున్సిపల్, వైద్య సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన సిపి



కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (మనం న్యూస్)ః కరీంనగర్‌లోని త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా త్రీటౌన్‌కు వెళ్లిన సిపి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలిం చారు. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులతో మాట్లాడి నిర్వహిస్తున్న విధులను అడిగి తెలు సుకున్నారు. రిసెప్షన్ లో ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయో తెలుసుకోవడం తోపాటు పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డు లను సక్రమంగా నిర్వహించాలన్నారు. 5 ఎస్ ప్రోగ్రాంలో భాగంగా పోలీస్ స్టేషన్ల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకుని అహ్లాదకరమైన వాతావ రణ ఏర్పాటు చేయాలని చెప్పారు. సిసి కెమెరాలు పనితీరును అడిగి తెలుసుకున్నారు.. పనిచేయని సిసి కెమెరాలను వెంటనే మరమ్మతు చేయించాల ని ఆదేశించారు. నేరాల ఛేదన, నియంత్రణలో కీలకపాత్ర పోషించే సిసి కెమెరాల పనితీరును ప్రతిరోజు పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి తుల శ్రీనివాసరావు, ఇన్స్‌పెక్టర్ దామోదర్ రెడ్డి లతోపాటుగా సిబ్బంది పాల్గొన్నారు

ః రూరల్ పోలీస్ స్టేషన్ లోః

పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బరాయుడు బుధవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన రికార్డుల నిర్వాహణను క్రమపద్ధతిలో నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల నేరాలను సమీక్షించారు. వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి మాట్లాడుతూ ఎక్కువశాతం కళాశాలలు ఈ ప్రాంతంలో ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరుగ కుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పా రు. అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేం దుకు నిరంతరం తనిఖీలు, దాడులను కొనసా గించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు చెందిన సిబ్బందితో సమావేశమై వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉండే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసిపి కరుణాకర్ రావు ఇన్స్‌పెక్టర్ విజ్ఞాన్ రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు తాగునీటి వసతి ప్రారంభం



గంభీరావుపేట, మార్చి 15 (మనం న్యూస్)ః గంభీరా వుపేట మండల కేం ద్రంలోని కేజీ టు పీజీ క్యాంపస్ లో చదువుతున్న విద్యార్థులకు తాగు నీటి సౌకర్యాని కో సం ఏర్పాటు చేసిన బోర్ వెల్ పంపు సెట్‌ను సర్పంచ్ కట కం శ్రీధర్ బుధవా రం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న మురికి కాలువల నిర్మాణ పనులను సర్పంచ్ పరిశీలించారు. పనులు నాణ్యత తో చేపట్టి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ ను కోరారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన



వీణవంక-మార్చి 15 9మనంన్యూస్): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ‘‘లాఅండ్ జస్టిస్-ఏ కేస్ స్టడీ’’ అనే పాఠ్యాంశంపై అవగాహనకల్పించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి అశోక్‌రెడ్డి, సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు ముల్కల కుమార్ లు విద్యార్థులతో కలిసి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్‌రెడ్డి విద్యార్థులకు ఫిర్యాదుచేయడం, ఎఫ్ఐఆర్ నమోదుచేయడం, ఆక్యూజుడ్,విక్టిమ్, ఇన్వెస్టిగేషన్, సివిల్,క్రిమినల్,అరెస్ట్,సమన్స్ జారీ చేయడం ,చార్జిషీటుదాఖాలు, బెయిల్‌పొందే విధానం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అప్పిలేటు విధానంలో భాగంగా క్రిందిస్థాయి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు, అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని, మహిళలు వేదింపులకు గురి అయినచో 1098,సైబర్ మోసాలకు గురి అయితే 1930 కి కాల్ చేయాలని సూచించారు. అనంతరం ఎస్సై విద్యార్థులకు పెన్నులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, లింగయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఈ పరీక్ష పేపర్ల లీకేజ్ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

### సూపరిండెంట్ కు వినతి పత్రం అందజేత

### ఎఐఎస్ బి రాష్ట్ర ప్రధానా కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి



కరీంనగర్ కలెక్టరేట్, మార్చి15 (మనం న్యూస్): టిఎస్‌పిఎస్‌సి నిర్వహించిన ఏఈ పరిక్ష పేపర్ లీక్ కావడం పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఎఐఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమైన అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల సూపరెండెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూటిఎస్‌పిఎస్‌సి ప్రతి నిర్వహించిన ఏఈ ప్రశ్న పత్రం లీక్ కావడం భాధాకరమని అన్నారు. దిని ద్వారా 3 లక్షల మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరకుండా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పేపర్ లీకేజ్ లో ఎవరి హస్తం ఉన్న వారు ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకోడానికి ప్రభుత్వం వెనకాడద్దని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు శంకర్ కురువెళ్లి, రమేష్,వినయ్, వినోద్, నాగరాజు,అభిరామ్ తదితరులు పాల్గోన్నారు.

# చెట్లను నాశనం చేస్తున్న విద్యుత్ శాఖ




తిమ్మాపూర్, మార్చి 15 (మనం న్యూస్): విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని పేర్కొంటూ విద్యుత్ శాఖ చెట్లను పెకిలిస్తుండడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయంగా ఉన్నాయన్న నెపంతో పెద్ద పెద్ద చెట్లను సైతం నేల కూలుస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కొమ్మలు నరుకుతున్నామని చెట్లనే పెకిలిస్తున్నారు

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పరిధిలోని అలుగునూర్ నుండి ఎల్ఎండి వరకు ప్రధాన రాజీవ్ రహదారి కి ఇరువైపులా ఉన్న చెట్లను ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ లైన్ లకు అడ్డుగా ఉన్నాయంటూ చెట్ల కొమ్మలతో పాటు చెట్లను పూర్తిగా నామరూపాలు లేకుండా నరికి వేశారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ నిధులు వెచ్చించి ఓవైపు మొక్కలు నాటిస్తుండగా, విద్యుత్ శాఖ చెట్లను నరికివేసుకుంటూ పోతోంది. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న వృక్షాల కొమ్మలను తొలగించాల్సిన సిబ్బంది, నిలువ నీడనివ్వడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షిస్తోన్న చెట్లను నరికివేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ తీగలు లేని ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటిని పెంచాల్సిన అధికారులు, ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యుత్ తీగల కిందనే మొక్కలు నాటిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు సైతం హరిత హారం సందర్భంగా ఎక్కడో ఓ చోట మొక్కలు నాటించి మమా అనిపిస్తున్నారు. తీరా అవి పెరిగిన అనంతరం విద్యుత్ శాఖ నిర్వాకానికి బలై, కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వీర్యమవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలకు తగలకుండా కొమ్మలను మాత్రమే నరికించాలని, అవసరం లేకున్నా చెట్లను పూర్తిగా కనుమరుగు చేయడాన్ని నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆదర్శ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



కరీంనగర్, మార్చి 15 (మనం న్యూస్): కరీంనగర్ లోని ఆదర్శ హాస్పిటల్లో అరుదైన కణతి శస్త్ర చికిత్సను బుధవారం నిర్వహించారు. లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ అరుణ్ కటారి, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ మానస తేజస్విని మెతుకులు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కరివేద సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కరివేద సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల అత్యుత్తమ వైద్య సేవలను ఆదర్శ హాస్పిటల్ లో అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇందుకోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లవేళలా తోడ్పడుతున్నట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లాను వైద్య సేవా రంగంలో అగ్రగామిగా నిలిపేందు కు ప్రజలకు సేవ అందిస్తూ తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

### పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్



సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 15 (మనం న్యూస్): గురువారం నుంచి ప్రారంభం కానున్న పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ యూనియన్ సభ్యత్వం తీసుకొని సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. యూనియన్ చట్టబద్ధంగా ఉండాలంటే ప్రతి కార్మికుడు యూనియన్ లో సంఘ సభ్యుడిగా చేరడం తప్పనిసరని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి పవర్లూమ్ కార్మికుడు బాధ్యతగా గుర్తించి తప్పకుండా యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నక్క దేవదాస్, శ్రీపతి, మణి, కంది మల్లేశం, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రసమయి



శంకరపట్నం, మార్చి15( మనం న్యూస్): శంకర పట్నం మండలం తాడిక ల్ గ్రామంలో బుధవా రం మానకొండూరు శాసనసభ్యులు డా రసమయి బాలకిషన్ బుధవారం వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి పథకం పేదలకు ఒక వరం లాంటిదని ప్రతి ఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంట మహిపాల్. తాడికల్ గ్రామ సర్పంచ్ కీసర సుజాత సంపత్. ఎంపీటీసీ బుద్ధార్తి వరలక్ష్మి సంపత్. బిఆర్ఎస్ పార్టీ నాయకులు దొంగల సతీష్. కోడూరి వీరస్వామి.గడ్డి శ్రీనివాస్. కళ్యాణ్. అనిల్. శ్రీకాంత్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

## సర్వేంద్రియానం నయనం ప్రధానం

### సర్పంచ్ అందే స్వరూప



చిగురుమామిడి, మార్చి15 (మనంన్యూస్): సర్వేంద్రియానం నయనం ప్రధానమని ఇందుర్తి గ్రామ సర్పంచ్ అందే స్వరూప అన్నారు. చిగురుమామిడి మండల పరిధిలోని ఇందుర్తి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి ధర్మానాయక్ సర్పంచ్ కు వార్డు సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలను అందజేశారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట సతీష్, వార్డు సభ్యులు చిలుపూరి విష్ణు ,చింతపూల శ్యామల, అపాల యశోద, భూరికి విజయ, సిరాజ్, డాక్టర్ శ్రీను, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు చింతపుల అంజయ్య, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి, కార్యదర్శి వెంకటరమణారెడ్డి ,డా. నిర్మల, సూపర్వైజర్ హేమలత,కవిత, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ గ్రామ కన్వీనర్‌గా ఆకవరం శివప్రసాద్



చిగురుమామిడి, మార్చి 15 మనం న్యూస్: చిగురుమామిడి గ్రామ బిఆర్ఎస్ కన్వీనర్ గా ఆకవరం శివప్రసాద్ ను నియమించినట్టు మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే సతీష్ కుమార్ గెలుపు కోసం, బిఆర్ఎస్ పార్టీని మరల అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని శివప్రసాద్ తెలిపారు. పార్టీలో క్రమశిక్షణ రహితంగా ఎవరు వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తెలిపారు.

## ఘనంగా కాన్షిరాం జయంతి వేడుకలు



కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 15 (మనం న్యూస్): బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షిరామ్ జయంతి వేడుకలను స్థానిక తెలంగాణ చౌక్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బిఎస్పీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు గాలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఉరుమల్ల విశ్వం హాజరై కాన్షిరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మహిళా కన్వీనర్ జన్ను స్వరూప, జిల్లా ఇన్చార్జి మంద బాలయ్య, మహిళా కన్వీనర్ లక్ష్మక్క, జిల్లా కార్యదర్శి బడుగు నరేష్, మానకొండూరు అసెంబ్లీ మహిళ కన్వీనర్ సుమలత, టౌన్ అధ్యక్షులు హస్తపురం మధు, నాయకులు సిరిసిల్ల అంజయ్య,తడగొండ చందు, దేవదాస్, కనకయ్య, రామ్ నరసయ్య, కండె నరేష్, గాలిపెల్లి శ్రీనివాస్, వెదిరే మారుతి, గోకులకొండ అభిలాష్ , రాహుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పొదుపు సంఘం 24వ వార్షిక మహాసభ



శంకరపట్నం, మార్చి15( మనం న్యూస్): శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నం గ్రామంలో బుధవారం కేశవపట్నం మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలు గోదారి ఉమ ఆధ్వర్యంలో శ్రీ కేశవ మహిళా పొదుపు సంఘం 24వ వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ మహాసభ కి ముఖ్యఅతిథిగా మండల మహిళా సంఘాల పొదుపు సమితి అధ్యక్షురాలు బక్కి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభలో పొదుపు సంఘం నాయకురాలు న్యాయం సునీత వార్షిక ఆదాయ, వ్యయాలు, పొదుపుల నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘం పాలకవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ జిల్లా అధ్యక్షుడిగా దాసం కిషన్ ఎన్నిక



మెట్ పల్లి మార్చి 15 (మనం న్యూస్ ): జగిత్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ ఎన్నికలు బుధవారం జగిత్యాల లో జరిగాయి. అధ్యక్షుడిగా దాసం కిషన్, జనరల్ సెక్రెటరీగా మల్యాల సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా గొడిసెల రమేష్, జయింట్ సెక్రెటరీ జాన్సన్ కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సాతార్ల మహేష్, గౌరవ అధ్యక్షుడిగా బూరం సంజీవ్, ముఖ్య సలహాదారుగా నరసాపురం రవీందర్ లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను ఎస్సీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటుకూరి మల్లేష్, సీనియర్ పాత్రికేయులు ఎస్ పి రవీందర్ లు జరిపించారు. ఈ ఎన్నికలలో జిల్లాలోని ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నేడు ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉచిత మెగా వైద్య శిబిరం




కోనరావుపేట మార్చి 16 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో గురువారం రోజున ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు చేన్నమనేని వికాస్ దీప ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా స్తోమత లేని బడుగు బలహీన వర్గాల వారికి అత్యున్నత వైద్య సేవలను మరియు అత్యధిక డయాగ్నొస్టిక్ సేవలను వారి గ్రామంలోని అందించడం ప్రతిమ సంచార ఆరోగ్య రథం ముఖ్య ఉద్దేశంఅని అన్నారు.ప్రతిమ సంచార ఆరోగ్య రథం అందించే వైద్య సేవలుఎక్స్ - రే, ఎలక్ట్రో కార్డియోగ్రామ్, కార్డియాక్ ప్రొఫైల్, మమ్మోగ్రఫీ, మినీ లాబొరేటరీ మరియు ఈ క్యాంపు ద్వారా ప్రత్యేకంగా మహిళలకు మరియు యుక్త వయసు బాలికలకు 3 నెలలకు సరిపడ ఉచిత సానిటరీ ప్యాడ్స్ పంపిణి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇట్టి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## యోగాలో మెరిసిన సెయింట్ జార్జ్ విద్యార్థులు



కొత్తపల్లి, మార్చి 15 (మనం న్యూస్): వర్షిని యోగ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ స్పోర్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున నిర్వహించిన ఆన్‌లైన్ యోగ కాంపిటీషన్లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(సిబిఎస్ఇ) విద్యార్థులు పాల్గొని అండర్-10 విభాగంలో అధ్వికానాత్ 4వ స్థానం, అండర్-15 విభాగంలో ధృతి 1వ స్థానం మ రియు స్మృతిజ 2వ స్థానాలు కైవసం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్యారడైజ్ మరియు సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలల చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను వాళ్లకి సహక రించినటువంటి తల్లిదండ్రులను, యోగా కోచ్ ప్రదీప్ ను అభినందించారు.

# క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు

జమ్మికుంట,మార్చి15( మనం న్యూస్ ):యువత క్రీడల్లో పాల్గొని శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనిబిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు అన్నారు.ఖేలో కరీంనగర్ జీతో కరీంనగర్ పేరిట కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న క్రీడోత్సవాలలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం క్రికెట్ పోటీలు గత మూడు రోజులుగా ప్రారంభమై బుధవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ తో ముగిశాయి. ఫైనల్ లో తలపడిన ఇల్లందకుంట జట్టుపైన వీణవంక జట్టు 15 పరుగులతో విజయం సాధించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికి అవసరమని, ముఖ్యంగా యువత క్రీడల్లో పాల్గొని శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈరోజు ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన వీణవంక జట్టును సంపత్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు హుజురాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి బిజెపి పట్టణ అధ్యక్షులు జీడిమల్లేష్ ఇల్లందకుంట మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ మల్యాల సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, బోగంపాడు సింగిల్



విండో వైస్ చైర్మన్ ఎండీ షఫీ,ఆరెల్లి శ్రీనివాస్,తుర్పాటి రాజు, డొంతుల రాజకుమార్,మోడెమ్ రాజు,రావుల శ్రీనివాస్,మారం తిరుపతి రెడ్డి,కొత్త శ్రీనివాస్, బూర్గుపల్లి రాము,జిల్లెళ్ళ శ్రీపాల్,ఎదులాపురం అశోక్, కైలాసకోటి గణేష్,ప్రవీణ్,కొక్కుల దేవేందర్,పురుషోత్తం, నర్ర మధుకర్ రెడ్డి,మట్ట పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన

# ఇంటర్ పరీక్షలు



గంభీరావుపేట, మార్చి 15 (మనం న్యూస్): ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్ష ల్లో 293 మంది విద్యార్థులకు గాను 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ తెలిపారు.

## టిఎస్‌పిఎస్సీ పేపర్ లీకేజీపై

# పిడిఎస్‌యు ఆందోళన



కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 15 (మనం న్యూస్): టిఎస్‌పి ఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీ పరీక్షల లీకేజీని నిరసిస్తూ పిడిఎస్‌యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడి కుమార్, తాటి రాణాప్రతాప్‌ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్, రాణాప్రతాప్‌లు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించి టిఎస్పీఎస్సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు అభిషేక్, శ్రవణ్, విజయ్, దీక్షిత్, సందీప్, రాజశేఖర్, నాని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాన్సిరాం జయంతి వేడుకలు



జమ్మికుంట,మార్చి15( మనం న్యూస్) :బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మానివర్ కాన్షి రామ్ జయంతి వేడుకలను జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. హుజరాబాద్ నియోజకవర్గం బిఎస్పి ఇన్చార్జ్ మారేపల్లి మొగిలయ్య జిల్లా కన్వీనర్ కవ్వంపల్లి లలిత ఆధ్వర్యంలో కాన్సిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో హక్కులకు గుర్తింపుకు జీవన ప్రమాణాలకు దూరంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు న్యాయం జరగాలంటే బహుజన అధికారం వలనే సాధ్యమని చెప్పిన అంబేద్కర్ సూత్రాన్ని పాటిస్తూ మహనీయుల స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహా మనిషి కాన్సిరాం అని వారు కొనియాడారు, వారి స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో బహుజన రాజ్యాన్ని సాధిస్తామని వారు అన్నారు,ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు మారేపల్లి మొగిలయ్య, కవ్వంపల్లి లలిత ప్రధాన కార్యదర్శి ఇలసాగర్ రఘుపతి జమ్మికుంట మండల అధ్యక్షుడు దాసారపు మహేందర్ బీఎస్పీ సీనియర్ నాయకుడు మిడిదొడ్డి శ్రీనివాస్ సారభద్ర స్వామి నరసయ్య పలువురు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 25వ వార్డును సందర్శించిన మున్సిపల్ చైర్మన్



జమ్మికుంట మార్చి15(మనం న్యూస్ ):జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 25వ వార్డును జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వర్ రావుబుధవారం సందర్శించి వార్డులోని సమస్యలను వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బచ్చు మాధవి శివశంకర్, పాతకాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ్ కి బచావో.. బిజెపి కి హఠావోను

# విజయవంతం చేయాలి

### బిజెపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 15 (మనం న్యూస్)ః దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్, పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బిజెపిని అడ్డుకునేందుకు దేశ్ కి బచావో బిజెపి కి హటావో అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. త్వరలో రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించి తగిన రీతిలోబుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. బుధవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసినప్పటికీ నేటి వరకు అమలు కావడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, నిరుద్యోగభృతి, భూసమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ అమలు కావడంలేదని, వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూనుకోవాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాలని పార్టీని ప్రజాసంఘాలను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న




సమస్యలను అధ్యయనం చేస్తూ ప్రజలకు వివరిస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందే స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబుతో పాటు మండలాల సిపిఐ కార్యదర్శులు, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్, గ్రామ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం సాగించాలి

### డిపిఆర్వో దశరథం



రాజన్న సిరసిల్ల, మార్చి 15 (మనం న్యూస్)ః తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం అదేశించారు. బుధవారం పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథం మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, మిషన్ భగీరథ మన ఊరు మనబడి కార్యక్రమం, సాగునీటి ప్రాజెక్టులు, హరితహారం, కేసిఆర్ కిట్, రైతుబంధు, రైతు భీమా కల్యాణలక్ష్మి, ఆసరా, కంటి వెలుగు వంటి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పథకాల సమాచారం ప్రజలకు చేరేలా చూడాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్దేశిత షెడ్యూల్ కు అనుగుణంగా ప్రచారం కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. రోజువారీగా క్షేత్ర స్థాయిలో కళాకారుల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి గ్రామ పంచాయితీ కార్యాలయం ధృవీకరించిన పత్రాలు, ఫొటోలు హైదరాబాద్ లోని తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యాలయంతో పాటు తమ కార్యాలయానికి కూడా పంపించాలని ఆయన సూచించారు.

## ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు



గంభీరావుపేట్, మార్చి 15 (మనం న్యూస్)ః బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 89వ జయంతి వేడుకలు బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు కర్రోళ్ల రాజు, పరశురాములు, అనిల్, లక్కిరెడ్డి రాజేందర్ రెడ్డి, నాగరాజ్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

ఇల్లందకుంట, మార్చి 15 (మనం న్యూస్)ః నాబార్డు సౌజన్యం తో వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్న మహిళలకు బుధవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాబార్డు డిడియం అనంత చేతుల మీదుగా శ్రీలత, వాసవి, మనిషా, రమ్య అనే మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా నాబార్డు డిడియం మాట్లాడుతు ఈ శిక్షణ ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళా సాధికారతకు నాబార్డు విశేష కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమమంలో వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రతినిధి బి.రజిత, గ్రామ సర్పంచ్ పుష్పాల శైలజ, ట్రైనర్ శ్రీలత, ఇంచార్జి బెంబిరి కిషన్ రావు మహిళలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు




జమ్మికుంట, మార్చి 15 (మనం న్యూస్)ః బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జమ్మికుంట పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 809 మంది విద్యార్థులకు గాను 729 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 80 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్రవంతి, కాకతీయ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.


## నకిలీ పత్రాలతో మా భూమి కాజేయాలని చూస్తున్నారు

### అధికారులకు మొరపెట్టుకున్న బాధితులు

రాజన్న సిరిసిల్ల, మార్చి 15, (మనం న్యూస్): నకిలీ ధృవీకరణ పత్రాలతో తన భూమి కబ్జాకు యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గడ్డం భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నాడు. వివరాల్లోకెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డికి చెందిన సర్వే నెంబర్ 164లో ఉన్న పట్టా భూమిలోకి అదే గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టికి చెందిన మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ దాసరి ఆనందం అనే వ్యక్తి దౌర్జన్యంగా రెండు ట్రాక్టర్ల రాళ్లు వేసి ఈ భూమి తనదేనని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. ఈ భూమికి మండల భూ సర్వేయర్ అధికారికంగా కొలతలు వేసి, సదరు భూమి తనకు చెందినదేనని తెలిపారన్నారు. అయినప్పటికీ అధికారులను మచ్చిక చేసుకొని హద్దులు పెట్టుకున్నావని దాసరి ఆనందం బెదిరిస్తూన్నాడని భాస్కర్ రెడ్డి వాపోయాడు. ఈ విషయంలో ఆనందం వద్ద ఉన్న పట్టా నకలు కాపీని పరిశీలించగా, అది ఆనందం వదిన దాసరి లచ్చవ్వ, పట్టా నెం. 670/2018 లో ఇచ్చినట్లు ఉందని తెలిపారు. ఈ ఆధారాలతో తాను మండల కార్యాలయంలో ఆర్టిఐ ద్వారా ధరఖాస్తు



చేసుకోగా, ఫైల్ నెంబర్ 670/2018లో కొట్టెపెల్లి అంజయ్య అని ఉన్నట్లు అధికారులు తెలిపారని, తనకు పట్టా ఇచ్చింది మాత్రం ప్రభుత్వమని దాసరి



ఆనందం చెబుతున్నప్పటికీ అది నకిలీదిగా ధృవీకరణ అయ్యిందని పేర్కొన్నారు. ఈ విషయంలో అప్పటి ఏమ్మార్వో అంజన్న హస్తం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని, సదరు భూమి తనదేనని చెప్తున్నా వినడం లేదని, చట్టబద్ధంగా అన్ని ఆధారాలు ఉన్న తన భూమిని ఇప్పించాలని, ఆనందం వేసిన రాళ్లు తొలగించాలని అధికారులను భాస్కర్ రెడ్డి కోరారు. అలాగే నకిలీ పట్టా తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులను పరీక్షలకు మానసికంగా సంసిద్ధం చేయాలి

## కరీంనగర్ కలెక్టర్ కర్ణన్



కరీంనగర్ బ్యూరో, మార్చి 15 (మనం న్యూస్): ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదవతరగతి పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సంసిద్ధులను చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరెట్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులతో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్న 12వేల144 రెగ్యులర్, 51 మంది ప్రైవేటు విద్యార్థుల కొరకు 78 పరీక్షా కేంద్రాల్లో



ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు 76 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 76 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇద్దరు అదనపు డిపార్ట్ మెంట్ అధికారులు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులతో పాటు 8వందల మంది ఇన్విజిలెటర్లను నియమించినట్లు వివరించారు. పరీక్షల వలన విద్యార్థులు భయాందోళన చెందకుండా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, పరీక్షలకు నిర్భయంగా హాజరయ్యేలా చూడాలని సూచించారు. బాలికల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జివి.శ్యాంప్రసాద్ లాల్, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : కరీంనగర్ క్రైమ్, గంగాధర, గన్నేరువరం, మానకొండూర్ రూరల్.

జగిత్యాల జిల్లా : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ఎడ్యూకేషన్, దరూర్ క్యాంపు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, ఎండపల్లి,

రాజన్న సిరిసిల్ల జిల్లా : సిరిసిల్ల క్రైమ్, సిరిసిల్ల ఆర్.సి., రుద్రంగి, చందుర్తి, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ ఆర్.సి., ముస్తాబాద్.

పెద్దపల్లి జిల్లా : పెద్దపల్లి / ఆర్.సి., టౌన్, రూరల్, రామగుండం, కోల్‌సిటి, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, అంతర్గాం, 8ఇన్ క్లైయిన్ కాలని, బసంత్‌నగర్.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన,
కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.

కె. తిరుపతి రెడ్డి
బ్యూరో ఇంచార్జ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
సెల్ : 83339 98076